క్లుప్తంగా

టీవీ బహూకరణ



దేవరుప్పుల: మండలంలోని ధర్మాపురం రెవెన్యూ పరిధి లక్ష్మణ్ తండా ప్రాథమిక పాఠశాలకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ డైమండ్ పూర్వ అధ్యక్షుడు లయన్ శ్రీనివాస్ తన తాత, నాయనమ్మ గట్టు వెంకటయ్య– రామక్క జ్ఞాపకార్థం ఎల్‌ఈడీ టీవీని బుధవారం బహూకరించారు. పాఠశాల హెచ్‌ఎం తాటి జ్యోతి, లయన్స్‌క్లబ్ జనగామ డైమండ్ అధ్యక్షుడు లయన్ గోడిశాల శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి లయన్ కందుకూరి నాగరాజు, కోశాధికారి లయన్ పరుష సిద్దయ్య పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ..

మండలంలోని మాధాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం శంకరాచార్య సేవా సమితి ప్రతినిధి బెహారా రవికాంత్ ఆధ్వర్యంలో టైలు, బెల్టులు, గుర్తింపు కార్డులను అందజేశారు. అలాగే స్థానికులు గుర్రం సబితా నాగరాజు దంపతులు క్రీడాసామగ్రిని అందించారు. హెచ్‌ఎం నల్ల లలిత, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ శ్యామల, టీచర్లు పాల్గొన్నారు.

‘రైతులకు అన్యాయం చేస్తే సహించబోం’



కొడకండ్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్న ప్రభుత్వం ఏడాదైనా అమలు చేయలేదని, రైతులకు అన్యాయం చేస్తే సహించబోమని, రైతుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. రెండోసారి మండల బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఉపేందర్‌ను ఆయన సన్మానించారు. ఈ సమావేశంలో కోటేశ్వర్, సోమన్న, రాము, వెంకన్న, అర్జున్, మహేష్, ఉపేందర్, ప్రకాష్, గణేష్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



బచ్చన్నపేట: వద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని చదవాలని లయన్స్ క్లబ్ 320 ఎఫ్ జిల్లా జీఎస్‌టీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పడమటి కేశ్వాపూర్, కట్కూర్‌లోని పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, ఆల్‌ఇన్ వన్ బుక్స్‌ను ఆయన పంపిణీ చేశారు. దేవేందర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎస్ జేయూ జిల్లా కమిటీ ఎన్నిక

జనగామ రూరల్: తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (టీఎస్ జేయూ) జిల్లా కమిటీని బుధవారం జిల్లాకేంద్రంలోని ఎస్.ఎస్.ఎన్ గార్డెన్‌లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నారగోని పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎం.శివకుమార్, గౌరవ సలహాదారుడిగా చీల కిరణ్ కుమార్, అధ్యక్షుడిగా ఉప్పలంచి నరేందర్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మగాని శ్రీకాంత్ గౌడ్, కోశాధికారిగా కొన్నె ఉపేందర్, ఉపాధ్యక్షులుగా గంగిశెట్టి మహేశ్ కుమార్, గుడికందుల కృష్ణ, చిటుకుల ఆంజనేయులు, వల్లాల మధు, సహాయ కార్యదర్శులుగా జి.ప్రవీణ్ కుమార్, పి.రాజు, పన్నీరు గోవర్ధన్, కార్యవర్గ సభ్యులుగా చెల్లోజు నవీన్ చారి, పోచంపల్లి రజిత, శ్రీనివాస్, గన్ను కార్తీక్, చిటుకుల అశోక్, ఓంకార్, సల్లా రవీందర్, ఎండీ.అఫ్రోజ్, రమేశ్ యాదవ్, మహిపాల్, తుంగ కౌశిక్, గుండా రాజు, బాలు తదితరులు ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యేను కలిసిన కమిషనర్



స్టేషన్‌ఘన్‌పూర్: జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్, స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్ నిమ్మ కృష్ణారెడ్డి బుధవారం హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ బాధ్యతగా పనిచేస్తూ ప్రజలందరి సహకారంతో స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించేలా పనిచేయాలని సూచించారు.

ఆదమరిస్తే అంతే..

- ప్రమాదకరంగా రోడ్డు పక్కన బావులు
- రక్షణ గోడలు కరువు



వడ్డెగూడెం సమీపంలో చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి కనిపించకుండా ఉన్న బావి



పల్లగుట్ట రోడ్డులో లోలెవల్ కల్వర్టు పక్కన ఉన్న బావి

చిల్పూరు : రోడ్డు పక్కన బావులతో ప్రయాణికులు హైరానా పడుతున్నారు. రాత్రి వేళ వెళ్లే ప్రయాణికులు ఏ మాత్రం పట్టు తప్పిన ఇక అంతే సంగతులు.. కొన్ని గ్రామాల్లో జనావాసాలకు దగ్గర ఉన్నాయి.. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుగతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మండలంలోని పల్లగుట్ట రోడ్డులో– 2, పల్లగుట్ట నుంచి మండల కేంద్రానికి వెళ్లే దారిలో– 2, వెంకటాద్రిపేటకు వెళ్లే రోడ్డులో–3 వ్యవసాయ బావులు రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్నాయి.. నిత్యం వాహనదారులు, ప్రయాణికులు తిరిగే రోడ్డు కాగా సంబంధిత అధికారులు ప్రమాదకర బావులకు రక్షణ గోడలు ఏర్పాటు చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పల్లగుట్ట క్రాస్ నుంచి ఫత్తేపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డులో దేశాయితండా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ దాటాక లోలెవల్ కల్వర్టు పక్కనే ప్రమాదకరంగా రోడ్డుకు ఆనుకుని బావి ఉంది. వర్షాలు పడినపుడు వాహనదారులు ఇక్కడకు చేరుకోగానే అదుపుతప్పు తామేమోనని నెమ్మదిగా వెళ్తున్నారు. ఇక మండల కేంద్రంనుంచి వెంకటాద్రిపేటకు వెళ్లే రోడ్డులో మూడు బావులు, పల్లగుట్ట నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్డుకు పక్కనే కాకుండా జనావాసాల మధ్య కూడా ప్రమాదకరంగా బావులు ఉన్నాయి. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే రక్షణ గోడలు ఏర్పాటు చేయించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

యజమానులకు నోటీసు ఇచ్చాం

రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావులు ప్రమాదకరంగా మారాయి. ఈవిషయంపై బావుల యజమానులకు ఇప్పటికే నోటీసులు అందజేశాం. వారు పట్టించుకోకుంటే తదుపరి చర్యలు మేమే తీసుకుంటాం.

– సరస్వతి, తహసీల్దార్

ఈజీఎస్ సిబ్బంది నిరసన

స్టేషన్‌ఘన్‌పూర్/నర్మెట: గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలు అందించాలని డిమాండ్ చేస్తూ స్టేషన్‌ఘన్‌పూర్, నర్మెట మండల పరిషత్ కార్యాలయాల వద్ద ఈజీఎస్ ఉద్యోగులు, సిబ్బంది బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈజీఎస్ పథకంలో క్రియాశీలకంగా పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది గత మూడు నెలలుగా వేతనాలు రాక దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకం విజయవంతంగా చేపట్టడంలో రాత్రి, పగలు కష్టపడి పనిచేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం సానుకూలంగా స్పందించి తమ వేతనాలను అందించాలని వారు కోరారు. అనంతరం ఎంపీడీఓలు విజయశ్రీ, అరవింద్ చౌదరికి వినతిపత్రాలు అందజేశారు. ఏపీఓలు ప్రేమయ్య, బిరుకూరి రమాదేవి, టెక్నికల్ అసిస్టెంట్‌లు జాంబ, బాబు, సునీత, కంప్యూటర్ ఆపరేటర్లు మీనాక్షి, సంజురాణి, రవి, ఎఫ్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఈజీఎస్ ఉద్యోగులు, సిబ్బంది



నర్మెటలో..

తాణు నాయక్ పోరాటం ఆదర్శనీయం



తాణు నాయక్ ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న నాయకులు

పాలకుర్తి: తాణు నాయక్ పోరాటం ఆదర్శనీయమని జీసీసీ మాజీ చైర్మన్ అభిమాన్‌గాంధీ నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తాణు నాయక్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా తాణు నాయక్ ఫ్లెక్సీకి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అభిమాన్‌గాంధీ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు తాణు నాయక్ పోరాటాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బానోత్ మహేందర్ నాయక్, లకావత్ వెంకట నాయక్, లకావత్ నాగరాజు, ధరావత్ రాంసింగ్, ధరావత్ యాకూబ్, బోడ గోవర్ధన్,మహేష్ నాయక్ లు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

రఘునాథపల్లి: మండలంలోని కన్నాయపల్లి గ్రామాన్ని ప్రాజెక్టు గ్రామంగా ఎంపిక చేసి నాలుగు సంక్షేమ పథకాలు అర్హులందరికి అందించడం పట్ల బుధవారం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు పగిడిపల్లి అశోక్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడంపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, జిల్లా నాయకులు లోనె శ్రవణ్‌కుమార్, మంతపురి అనిల్, బాషపాక కుమార్, పూజారి మదన్‌మోహన్, వడ్లకొండ శివప్రసాద్, నల్లూరి ఉపేందర్, మున్నీర్, అశోక్, భాస్కర్ పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

‘ఆరు గ్యారంటీ’లు అమలు చేయాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సాయన్న

రఘునాథపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన ఆరు గ్యారంటీలు వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలో సీపీఐ నాయకుడు తూడి రేణుబాబు అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 4వ తేదీన జిల్లా కేంద్రంలోని కామాక్షి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సీపీఐ శతాబ్ది బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆరు గ్యారంటీలు అమలు చేయడం లేదని విమర్శించారు. రైతులకు రైతు భరోసా ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి, నాయకులు గండె వెంకటేశ్వర్లు, జనిగిల అంజయ్య, ముప్పిడి ఎల్లయ్య, తూడి శ్రీనివాస్, బాల్నె ఉదయ్, చాట్ల లక్ష్మీనర్సు, చిట్యాల ఉప్పలయ్య, పసులు దానియేలు, బాల్నె చరణ్, సురుగు రమేష్, బిర్రు నాగేష్, దైద దానియేలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆది సాయన్న

35 ఏళ్ల తర్వాత బ్యాంకు ఏర్పాటు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్: 35 ఏళ్ల తర్వాత జఫర్‌గఢ్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచి ఏర్పాటు కానుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. మండల కేంద్రంలో బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచి ఏర్పాటు కోసం ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో కలిసి బుధవారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా బ్యాంక్‌కు కావాల్సిన భవనాన్ని పరిశీలించారు. జఫర్‌గఢ్ మెయిన్ రోడ్డులో నిర్మిస్తున్న భవనంలో బ్యాంకు ఏర్పాటు చేసేందుకు అధికారులు అంగీకరించారు. వెంటనే భవన యాజమానితో మాట్లాడి బ్యాంకు ఏర్పాటుకు అవసరమైన పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ 35 ఏళ్ల క్రితం నక్సలైట్ల పేల్చివేతతో జఫర్‌గఢ్ నుంచి బీటీబీ బ్రాంచి స్టేషన్ ఘన్‌పూర్‌కు తరలివెళ్లిందని, దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా జఫర్‌గఢ్‌కు బీఓబీని తీసుకురావడం జరిగిందన్నారు. బ్యాంకు ఆర్‌ఎం చంద్రశేఖర్, మేనేజర్ శరత్‌చంద్ర, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే జఫర్‌గఢ్‌లో కూరగాయలు విక్రయించే వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. వ్యాపారం ఎలా సాగుతుంది, గిట్టుబాటు అవుతుందా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇటీవల మృతి చెందిన రఘుపతిశర్మ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.



బ్యాంకు అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, గ్రామస్తులు

రైతుబీమా చెక్కు అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్: తానేదార్‌పల్లికి చెందిన ఆకుల సరోజనకు ప్రభుత్వం నుంచి మంజూరైన రైతు బీమా చెక్కును హనుమకొండలో ఎమ్మెల్యే శ్రీహరి అందజేశారు. ఆకుల శ్రీనివాస్ కొన్ని నెలల క్రితం మృతిచెందగా అతడి భార్య సరోజనకు రైతుబీమా చెక్కును అందించారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



పాలకుర్తిటౌన్: రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తోందని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. మండలంలోని దర్దెపల్లి గ్రామానికి చెందిన రైతు నిమ్మల యాకయ్య పంట పెట్టుబడి కోసం చేసిన అప్పు తీర్చలేక ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబ సభ్యులను బుధవారం కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, భూభారతి రూపకర్త భూమి సునీల్‌కుమార్ పరామర్శించారు. రైతు కుటుంబాన్ని ఓదార్చారు. రైతుకు వెన్నుదన్నుగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని, ఆత్మహత్యలు లేని తెలంగాణనే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎవరూ అధైర్య పడవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, రాపాక సత్యనారాయణ, కుమారస్వామి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చిల్పూరు: బాలికలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాజవరం గ్రామ పంచాయతీ పరిధిలోని కేజీబీవీలో బుధవారం సైబర్ నేరాలపై ఎస్‌ఓ ప్రశాంతి అధ్యక్షతన బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్, కానిస్టేబుల్ చారి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

లింగాలఘణపురం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అదేవిధంగా ప్రజలు సైబర్ మోసగాళ్ల వలలో పడొద్దని ఎస్సై శ్రావణ్‌కుమార్ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని వడిచర్లలో జాగృతి పోలీసు శాఖ బృందం ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా నూతన చట్టాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. నాగమణి, విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాసు, రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



చిల్పూరు: మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

అన్నదానం

పాలకుర్తి: మండల కేంద్రంలో అమావాస్యను పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దాతలు మారం శ్రీనివాస్, అల్లాడి వెంకటేశ్వర్లు, నంగునూరి మధు, రామగిరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న సంఘం నాయకులు

సుదర్శనయాగం



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శ్రావణ నక్షత్రం పురస్కరించుకుని బుధవారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ కనులపండువగా సుదర్శనయాగం, స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో నాగర్‌కర్నూలు జిల్లా వెల్దండకు చెందిన హరికాంత్‌రెడ్డి– మానస దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, మల్లికార్జున్ పాల్గొన్నారు.

డ్రైక్లీనింగ్ యంత్రాలకు రుణాలివ్వాలి

లింగాలఘణపురం: రజక వృత్తిదారులకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి డ్రైక్లీనింగ్ యంత్రాలకు రుణాలు ఇవ్వాలని రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏదునూరి వీరయ్య బుధవారం హైదరాబాద్‌లో బ్యాంకు చైర్మన్ వై. శోభను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు.

‘చర్య తీసుకోవాలి’

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కృష్ణవేణి టాలెంట్‌స్కూల్‌పై విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ ఎండీ యూనస్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జానీపాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఈఓ కొమురయ్యకు బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో కనీస సౌకర్యాలు లేవని, పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి పాఠశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు నీల మహేష్, సృజన్ పాల్గొన్నారు.

ఎన్నిక

జనగామ రూరల్/చిల్పూరు: ఈనెల25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డిలో జరిగిన సీపీఎం రాష్ట్ర నాల్గవ మహాసభల్లో మూడోసారి జిల్లాకు చెందిన మోకు కనకారెడ్డి రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానన్నారు. అలాగే రాష్ట్ర కమిటీ ఆహ్వానితుడిగా చిల్పూరు మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన ఉడుత రవీందర్ ఎన్నికయ్యారు.

ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయించాలి


జఫర్‌గఢ్: మండలంలో ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంత కాకుండా వెంటనే వాటికి హద్దులు నిర్ణయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నాయబ్ తహసీల్దార్ కిషన్‌నాయక్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, కాట సుధాకర్, వడ్లకొండ సుధాకర్, యాతం సమ్మయ్య, శంషోద్దీన్, తాళ్లపల్లి శ్రీధర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గానుగుపహాడ్‌లో బస్సులు నిలపాలి

జనగామ రూరల్: మండలంలోని గానుగుపహాడ్ గ్రామంలో ఆర్టీసీ బస్సులు నిలపాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహిపాల్ కోరారు. ఈ మేరకు బుధవారం జనగామ డిపో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం నుంచి ఉదయం కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సులు నిలపకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామస్తులు, ఇంటర్, డిగ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల సీనియర్ మేట్ల సంఘం ఎన్నిక



కొడకండ్ల: మండలంలోని నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఉపాధి హామీ పథకం సీనియర్ మేట్ల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం మండలకేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ మేట్లను నూతన గ్రామ పంచాయతీలకు ఫీల్డ్ అసిస్టెంట్లుగా ప్రమోట్ చేయాలని సంఘం తీర్మానించింది. అధ్యక్షుడిగా గుగులోత్ యాకు, ప్రధాన కార్యదర్శిగా ధరావత్ రాము, ఉపాధ్యక్షుడిగా ధరావత్ రాజేందర్, కార్యదర్శులుగా బానోత్ నీమా, గుగులోత్ మహేష్‌లు, సలహాదార్లుగా మహేందర్, రాము, భిక్షపతి, మహేందర్, భిక్షపతి, రమేశ్ ఎన్నికయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలకు వచ్చే నెల 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ సునీత బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 3 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ఉంటుందని, ఏప్రిల్ 13న ఉదయం 10 నుంచి 12 గంటలకు ఆరో తరగతి, 7నుంచి 10 తరగతికి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ప్రవేశ అర్హత పరీక్ష ఉంటుందని వివరించారు.

‘బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయాలి’

పాలకుర్తిటౌన్: గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల సాంబయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. భూమ రంగయ్య, చిలువేరు కృష్ణమూర్తి, దేవరాయ సాయిలు, సంగి వెంకన్న, పనికర మోహన్‌రాజు, నలమాస రమేష్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది గ్రామంలో బుధవారం టీడీపీ మండల పార్టీ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బొక్క రామచంద్రయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనపట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం రానుందన్నారు. ఎండీ జహంగీర్, ఎడ్ల మల్లేష్, కొంగరి నర్సింగరావు పాల్గొన్నారు.

సన్మానం

జనగామ రూరల్: వడ్లకొండ గ్రామాభివృద్ధికి కార్యదర్శి దోర్నాల మనోహర్ చేసిన కృషి మరువలేనిదని జీపీ సిబ్బంది ఆయన సేవలను కొనియాడారు. బుధవారం మనోహర్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. వైద్యులు, మహిళలు, జీపీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధభేరి సభను జయప్రదం చేయాలి

జఫర్‌గఢ్: ఫిబ్రవరి 2వ తేదీన హనుమకొండలోని ఆచార్య జయశంకర్ ప్రాంగణంలో నిర్వహించనున్న యుద్ధభేరి భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్‌గాడ్గే పిలుపునిచ్చారు. సభ విజయవంతం చేయాలని కోరుతూ బత్తుల సిద్దేశ్వర పటేల్ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం జఫర్‌గఢ్ మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా కుమార్‌గాడ్గే మాట్లాడారు. మాదం నరేష్, కుంటి విజయ్‌కుమార్, కోట్ల వాసుదేవ్, కలకోట బాబు, దిలీప్ పాల్గొన్నారు.

మహాధర్నాను..

రఘునాథపల్లి: భవన నిర్మాణ రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య, జిల్లా అధ్యక్షుడు తూడి అంజయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో వారు భవన నిర్మాణ రంగాల కార్మికులను కలిసి ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత


రఘునాథపల్లి: పుట్టెడు దుఃఖంలో ఉన్న స్నేహితుడికి చిన్న నాటి మిత్రులు చేయూత అందించారు. మండల కేంద్రానికి చెందిన సురుగు శ్రీనివాస్ భార్య వరలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మరణించింది. సమాచారం తెలుసుకున్న 1996–97 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి చిన్ననాటి స్నేహితులు బుధవారం రఘునాథపల్లికి చేరుకుని శ్రీనివాస్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు శ్రీనివాస్ కుమార్తె పేర రూ.25వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను అందజేశారు. స్నేహితుడి కుటుంబానికి భరోసాగా ఉంటామని వారు పేర్కొన్నారు. స్నేహితుడి కుటుంబానికి చేయూత అందించడం పట్ల వారిని గ్రామస్తులు అభినందించారు. ఎండీ రంజాన్, శంకర్ రెడ్డి, వీరస్వామి, పెద్దగోని రాజు, వేణు, నాగరాజు, మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.



బాండ్ అందజేస్తున్న స్నేహితులు

పాఠశాలలో మాక్‌పోలింగ్

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో హెచ్‌ఎం కె.రమేశ్ పర్యవేక్షణలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు కె.కృష్ణవేణి, ఈ.రమేశ్, కె.రజని ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల విద్యార్థులకు మాక్‌పోలింగ్ నిర్వహించారు. స్కూల్ లీడర్, క్లాస్ లీడర్లను ఎన్నుకునేందుకు నిర్వహించిన మాక్‌పోలింగ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా కౌంటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించే ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా మాక్‌పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, శ్రీనాథ్, శ్రీనికాంత్, యాదగిరి, రాధాక్రిష్ణ, రవి, శర్మ, సర్వర్ బాషా, ఫకీర్‌దాస్, లక్ష్మీప్రసాద్, శ్రీదేవి, అరుణ,జ్యోతి, జానకి పాల్గొన్నారు.



మాక్‌పోలింగ్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు